క్లుప్తంగా

నేడు పాదాలమ్మ, బంగారమ్మ పండగ

సింహాచలం: సింహగిరి గ్రామ దేవతలు పాదాలమ్మ, బంగారమ్మ పండగ మంగళవారం జరగనుంది. ఈ మేరకు ఆలయ పూజారులు, సింహగిరి నివాసితులు ఏర్పాట్లు చేశారు. రాత్రి అనుపు మహోత్సవం నిర్వహించనున్నారు. భక్తులు, గ్రామస్తులు అమ్మవార్లను దర్శించుకుని ఆశీస్సులు పొందాలని పూజారులు కోరారు. సోమవారం రాత్రి తొలేళ్ల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

అప్పన్న సన్నిధిలో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ డి.రమేష్‌కు అప్పన్న జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో ఆనంద్‌కుమార్

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం అలహాబాద్ హైకోర్టు జస్టిస్ డి.రమేష్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు దేవస్థానం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి ఆలయ బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో అష్టోత్తర పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం న్యాయమూర్తికి స్వామివారి జ్ఞాపిక, ప్రసాదం, శేషవస్త్రాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

దేవస్థానానికి వంట సామగ్రి వితరణ



ఈవో శ్రీనివాసమూర్తికి ఇత్తడి సామగ్రి అందిస్తున్న లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్ సోమవారం ఇత్తడి వంట సామగ్రిని అందజేశారు. స్వామివారి వంటశాలలో ప్రసాదాల తయారీకి వీటిని వినియోగించనున్నారు. వంట సామగ్రిని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తికి ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యుడు టి.పి.రాజగోపాల్, ఏఈవో ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

జీవ వైవిధ్యంపై అవగాహన అవసరం



వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పరవాడ: జీవ వైవిధ్యంపై విద్యార్థులకు అవగాహన అవసరమని జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్.ఖగేశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ జీవ వైవిధ్య మండలి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అనకాపల్లి ఆధ్వర్యంలో వక్తృత్వ, షార్ట్ ఫిలిం పోటీలు, జీవ వైవిధ్యంపై యువత పాత్ర అనే అంశంపై వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలలో సోమవారం జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు హాజరై ప్రతిభ కనబరిచారు. విజేతలకు స్వాతంత్య్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేస్తామని పాఠశాల హెచ్‌ఎం పి.కనకేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ బి.అన్నాజీరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిల్లర సమస్యకు చెక్

క్యూఆర్ కోడ్ స్కానర్ల ఏర్పాటు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు టికెట్ కోసం ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. దీని ద్వారా చిల్లర సమస్యకు కూడా చెక్ పెట్టారు. ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేందుకు వీలుగా మూడు చోట్ల క్యూఆర్ కోడ్ స్కానర్లు ఏర్పాటు చేశారు. క్యూ లైన్లలో నిల్చోవాల్సిన పరిస్థితి లేకుండా వీటిని ఏర్పాటు చేసింది. ఒకటో ప్లాట్‌ఫాం వద్ద టికెట్ కౌంటర్ల వద్ద, మరొకటి రిజర్వేషన్ కౌంటర్ వద్ద ఏర్పాటు చేశారు. రైల్వే ప్రయాణికులు వీటిని సద్వినియోగపర్చుకోవాలని అధికారులు కోరుతున్నారు.



వేపగుంట సమీప వరలక్ష్మీనగర్ వద్ద అధ్వానంగా వేపగుంట–పినగాడి రహదారి



లక్ష్మీపురం వద్ద రోడ్డు దుస్థితి

ప్రయాణం.. నరకప్రాయం

- పాడైన వేపగుంట–పినగాడి రోడ్డు
- జీవీఎంసీ నిధులు మంజూరై టెండర్ పూర్తయిన వైనం
- రోడ్డుకు మీరెలా మరమ్మతులు చేస్తారని కొర్రీ వేసిన ఆర్‌అండ్‌బీ అధికారులు
- యంత్రాంగం సమన్వయ లోపంతో ఇక్కట్లకు గురవుతున్న ప్రజలు



చింతల అగ్రహారం వంతెన వద్ద గోతులమయమైన రోడ్డు

పెందుర్తి: నియోజకవర్గంలో అత్యంత కీలకమైన రహదారుల్లో వేపగుంట–పినగాడి మార్గం ఒకటి. చోడవరం, సబ్బవరం, కె.కోటపాడు, దేవరాపల్లి ప్రాంతాల నుంచి నగరానికి చేరుకోవాలంటే ఈ మార్గాన్నే ప్రజలు ఎంచుకుంటారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. అలాంటి రహదారి పూర్తిగా గోతులమయంగా మారింది. దీనిపై రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి పునర్నిర్మించేందుకు గత ప్రభుత్వ హయంలో రెండేళ్ల క్రితమే రూ.11 కోట్లు నిధులు మంజూరు కాగా అప్పటి కాంట్రాక్టర్(ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యేగా ఉన్నారు) ఏవేవో కారణాలు చూపించి రోడ్డు నిర్మాణం తాత్సారం చేస్తూ వచ్చారు. అనంతరం కనీసం మరమ్మతులైనా చేపడదామని జీవీఎంసీ ముందుకు వచ్చి రూ.1.50 కోట్లు నిధులు మంజూరు చేసింది. అనంతరం టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేసుకుంటున్న సమయంలో ఆర్ అండ్ బీ అధికారులు కొర్రీ వేశారు. మా పరిధిలోని రోడ్డుపై మీ పెత్తనం ఏంటని జీవీఎంసీ అధికారులకు నోటీసులు జారీ చేయడంతో రోడ్డు పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చింది.

పనులు ప్రారంభమవుతాయనుకుంటే..

గత ప్రభుత్వ హయాంలో నిధులు విడుదల కాగా కాంట్రాక్టర్ తాత్సారం, ఎన్నికలు రావడంతో పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఎన్నికల తరువాత కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు ప్రారంభించేందుకు జీవీఎంసీ అధికారులు సన్నాహాలు చేశారు. జూన్ 27న ఈ ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సైతం రెండు రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని ప్రకటించారు. దీంతో ప్రజలు రోడ్డు నిర్మాణం జరుగుతుందని ఆశలు పెట్టుకోగా..వాటిపై ఆర్ అండ్ బీ అధికారులు నీళ్లు చల్లారు. మా పరిధిలో ఉన్న రోడ్డు పనులు మీరు చేపట్టడమేంటని జీవీఎంసీ కమిషనర్‌ను లేఖ ద్వారాక పోలీసులు ప్రశ్నించడంతో పాటు పనులు తక్షణమే నిలుపుదల చేయాలని ఆ లేఖలో పేర్కొన్నారు. దీంతో పనులు ప్రారంభం కాకుండానే నిలిచిపోయాయి.

తీవ్ర ఇబ్బందులు

దాదాపు 10 కిలో మీటర్ల విస్తీర్ణం ఉన్న వేపగుంట–పినగాడి రహదారి పూర్తిగా గోతులమయం అయింది. అడుగడుగునా శిథిలమై ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. వాహనాలు గోతుల్లో దిగడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటుగా ప్రయాణం చేస్తున్న వారికి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు మరమ్మతులు/నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆర్‌అండ్‌బీ లేఖ వల్లే ఆగిన పనులు

వేపగుంట–పినగాడి రహదారి మరమ్మతుల నిమిత్తం కమిషనర్ రూ.1.50 కోట్లు మంజూరు చేశారు. పనుల నిమిత్తం టెండర్ కూడా పిలిచాం. ఇటీవలే పనులు ప్రారంభిద్దామని అనుకున్న తరుణంలో మా పరిధిలో పనులు చేపట్టవద్దని ఆర్‌అండ్‌బీ లేఖ ద్వారా కోరారు. దీంతో పనులు నిలిపివేశాం.

– విజయ్‌కుమార్, డీఈ, జోన్–8, జీవీఎంసీ

మోడలింగ్‌లో మెరిసిన రిషిక



రెండో స్థానంలో నిలిచి ట్రోఫీ కైవసం చేసుకున్న తన్వీ రిషిక

దాబాగార్డెన్స్: థాయిలాండ్‌లో జరిగిన జూనియర్ మోడల్స్ ఇంటర్నేషనల్ పోటీలో నగరానికి చెందిన తన్వీ రిషిక విశేష ప్రతిభ కనబరచి రెండో స్థానంలో నిలిచింది. వివిధ దేశాల విజేతల మధ్య జరిగిన హోరాహోరీ పోటీల్లో ప్రి టీన్ కేటగిరీలో నగరానికి చెందిన తన్వీ రిషిక రెండో స్థానంలో నిలిచి ట్రోఫీ కైవసం చేసుకుంది. కాస్ట్యూమ్స్ విభాగంలో బెస్ట్ రిప్రజంటేషన్ ఫ్రమ్ ఇండియా, సూపర్ టాలెంట్ ఆఫ్ సీజన్ అవార్డులను సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా తన్వీ రిషిక మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇప్పటికే చాలా ఫ్యాషన్ షోల్లో విజేతగా నిలిచానని తెలిపింది. రిషిక తండ్రి సురేష్ కుమార్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి తన కుమార్తెకు ఉన్న ఆసక్తిని గుర్తించి ఫ్యాషన్ రంగంలో ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. తన్వీ తల్లి ప్రసన్న రేణుక మాట్లాడుతూ విశాఖలో నిర్వహించిన ఆంధ్రా ఫ్యాషన్ పోటీల్లో కూడా తన కుమార్తె విజేతగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా ఫ్యాషన్ రంగంలో జారీ ఎత్నిక్ వేర్, సూర్యప్రభ నందిని, రోహిత్, అరుణ్‌రతన్, నరేస్ మాస్టర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.


రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న యువకులను రైల్వే పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు. జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారులు ఆదేశాలతో రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్‌ఐ ఎంఎల్ మీనా రైల్వేస్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒడిశా రాష్ట్రం బోలంగీర్‌కు చెందిన దోలమని రానా, బీహార్‌కు చెరందిన శివశంకర్ రేలు గంజాయి రవాణా చేయడాన్ని గుర్తించారు. విశాఖ మీదుగా ముంబై, హౌరాలకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. వీరి నుంచి సుమారు రూ.77,500 విలువైన 15.5కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని జీఆర్పీ ఎస్‌ఐ శాంతారంకు అప్పగించగా, వీరిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

పాత నేరస్తుడు అరెస్ట్

విశాఖ గవర్నమెంట్ రైల్వే పోలీసులు సోమవారం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తుండగా గంజాయి కేసులో తప్పించుకుతిరుగుతున్న నిందితుడ్ని అరెస్టు చేసినట్టు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు తెలిపారు.

గాయపడిన క్యాషియర్ చికిత్స పొందుతూ మృతి



ప్రమాదంలో మృతి చెందిన రామారావు(ఫైల్)

పరవాడ: దేశపాత్రునిపాలెంలో దావత్ దాబాలో క్యాషియర్‌గా పని చేస్తున్న రామారావు అనే వ్యక్తి కాలు జారి కింద పడి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. గాజువాకకు చెందిన పంచదార్ల రామారావు(40), దావత్ దాబా ఓనరు జగదీష్, జేమ్స్, ప్రసాద్‌లు కలిసి సోమవారం ఉదయం కారిపోతున్న రేకుల షెడ్డు పైఎక్కి సిమెంటుతో పనులు చేస్తుండగా రామారావు ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో రామారావు తలకు బలమైన గాయాలు కాగా తీవ్ర రక్తస్రావమైంది. తీవ్రంగా గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం నగరంలోని కేజీహెచ్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ బాలసూర్యారావు తెలిపారు.

‘ఉక్కు’పై కుట్రలు తగవు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకునే విధంగా కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. ఐఎన్‌టీయూసీ యూనియన్ పాయింట్ వద్ద సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడున్నరేళ్లుగా ఉక్కు కార్మికులు ఉద్యమాలు చేస్తున్నా కేంద్రం విశాఖ ఉక్కును నష్టపరిచే చర్యలు కొనసాగిస్తూనే ఉందని ఆరోపించారు. పోరాటాల వల్ల ప్రైవేటీకరణ చేయకపోయినా విశాఖ ఉక్కును పూర్తిగా నిర్వీర్యం చేసి అమ్మేసే ప్రయత్నాలు చేస్తుందని మండిపడ్డారు. మూడు బ్లాస్ట్‌ఫర్నేసుల్లో ఒకటి మూడేళ్లుగా మూసేసారని, మిగిలిన రెండింటిని కూడా మూసి వేసే పరిస్థితి కేంద్రం తీసుకు వస్తుందన్నారు. వెంటిలేటర్‌పై ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్రం తక్షణం ఆదుకోకపోతే లక్షలాది కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. పది వేల కోట్లు వర్కింగ్ క్యాపిటల్ సమకూర్చాలని, అవసరమైన రా మెటీరియల్ సకాలంలో అందేలా చేసి పూర్తిస్థాయిలో ఉత్పత్తిని పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ఉక్కుమంత్రి కుమారస్వామి ప్లాంట్ సందర్శనలో ఆదుకుంటామి భరోసా ఇచ్చినా ఇంత వరకు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పి.వి. రమణమూర్తి, ప్రభాకరరెడ్డి, బి.ఎస్. రాజు, ఎస్.ఎ. నాయుడు, మోహన్, రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

బొత్సకు అదీప్‌రాజ్ శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్సతో అదీప్‌రాజ్, నాయకులు

పెందుర్తి: ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శుభాకాంక్షలు అందించారు. రానున్న ఎన్నికల్లో పూర్తి బలం ఉన్న వైఎస్సార్‌సీపీనే విజయం వరిస్తోందన్నారు. నగరంలోని బొత్స నివాసంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైలా సన్యాసిరాజు, అంతకాపల్లి సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో అర్జీల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం పెందుర్తి ఎమ్మెల్యే, జిల్లా జనసేన అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పెందుర్తితో పాటు జిల్లాలోని ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటిని పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

కృష్ణా కళాశాలలో డిగ్రీ ప్రవేశాల జాబితా విడుదల

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి అర్హుల జాబితాను విడుదల చేశారు. విద్యార్థులు ఈ నెల 16వ తేదీలోగా అలాట్‌మెంట్ ఆర్డర్‌తో పాటు, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని వెళ్లి ప్రవేశం పొందాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

10వేల మందితో త్రివర్ణ పతాక ర్యాలీ రేపు



వివరాలు వెల్లడిస్తున్న బసవ కృష్ణమూర్తి

దాబాగార్డెన్స్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా బుధవారం వైఎస్సార్ సెంట్రల్ పార్క్‌లో 10 వేల మంది విద్యార్థులతో.. 25వేల చదరపు అడుగుల త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించనున్నట్టు స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర విద్యార్థి సేవ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుంకరి రమణమూర్తి కోరారు. కార్యక్రమంలో గొల్ల ప్రదీప్‌రాజు, కర్రి నరేష్, ఇషాక్ మహ్మద్, పీవీకే కుమార్, శివ దల్లై, తమ్మన విజయ్, శ్రీకాంత్, రామాయణం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి



రక్తదానం చేస్తున్న ఫార్మాసిటీ ఉద్యోగులు

పరవాడ: రక్తదానం చేయడానికి యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఫార్మాసిటీమేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లాల్‌కృష్ణ పిలుపునిచ్చారు. రాంకీ ఫౌండేషన్ 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్ సౌజన్యంతో ఫార్మాసిటీ పరిపాలన భవనంలో సోమవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ముందుగా ఈ శిబిరాన్ని లాల్‌కృష్ణ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో అవసరమైన మేరకు రక్తం లభించడం లేదన్నారు. వెనకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలైన విశాఖ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో గర్భిణులకు ప్రసవం సమయంలో అవసరమైన రక్తం అందక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సమస్యను అధిగమించాలంటే ప్రతి పౌరుడు ఏడాదికి మూడు పర్యాయాలు రక్తదానం చేయడానికి ముందుకు రావలసిన అవసరం ఉందన్నారు. ఈ శిబిరంలో 150 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. రక్తదాతలకు డాక్టర్ లాల్‌కృష్ణ సర్టిఫికెట్లను అందజేసి, అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్మన్ కె.శ్రీనివాసరావు, ఫార్మాసిటీ డీజీఎం గరధర్‌భక్షి, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ కె.శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలపై తక్షణ స్పందన అవసరం

- జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి జస్టిస్ వెంకట శేషమ్మ
- సింహగిరిపై ఆయా శాఖల అధికారులతో సమావేశం



న్యాయ విజ్ఞాన సదస్సులో గిరిజన మహిళలకు సూచనలు చేస్తున్న జస్టిస్ వెంకట శేషమ్మ

సింహాచలం: సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునే హక్కు ప్రతి గిరిజనుడికి ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జస్టిస్ వెంకట శేషమ్మ తెలిపారు. గిరిజన సమస్యలను సత్వరం పరిష్కరించి, వారి సంక్షేమానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సింహగిరిపై ఉన్న గిరిజన గ్రామంలో సోమవారం సమావేశం నిర్వహించారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులు ప్రతీ ఒక్కరూ చదువుకుని ఉన్నత స్థానంలో ఉండాలన్నారు. అన్ని విషయాలపైనా అవగాహన అవసరమని చెప్పారు. సంక్షేమ పథకాలను అర్హులైన గిరిజనులకు అందించాలని సూచించారు. ఈ తరుణంలోనే పింఛన్లు, బాలామృతం, రెవెన్యూ సేవలు, పారిశుధ్యం తదితర అంశాలపై పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, చినగదిలి తహసీల్దార్ పాల్‌కిరణ్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జయదేవి, సీడీపీవో ఎం.శ్రీదేవి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి జి.సుబ్రహ్మణ్యం, జీవీఎంసీ 8వ జోన్ కమిషనర్ హేమావతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామినాయుడు పాల్గొన్నారు.

హైవేపై చేపల లారీ బోల్తా



జాతీయ రహదారిపై ప్రమాదానికి గురైన చేపల లోడు లారీ

సబ్బవరం: మండలంలో సబ్బవరం జాతీయ రహదారిపై పెదనాయుడుపాలెం వద్ద సోమవారం ఉదయం చేపల లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి ఆగి ఉన్న మరో లారీని ఢీకొట్టింది. గాయపడిన లారీ డ్రైవర్‌ను హైవే పోలీసులు చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. హైవే మొబైల్ ఏఎస్‌ఐ రవికుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. తాడేపల్లిగూడెం నుంచి చేపల లోడుతో లారీ అసోం రాష్ట్రం గౌహతికి బయలుదేరింది. ఈ లారీ పెదనాయుడుపాలెం వద్ద ట్యాంకర్‌ను తప్పించే క్రమంలో ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టింది. దీంతో చేపల లారీ రోడ్డుకు అడ్డంగా బోల్తాపడింది. లారీ క్యాబిన్ నుజ్జునుజ్జయింది. ప్రమాదంలో క్యాబిన్‌లో చిక్కుకుపోయిన డ్రైవర్‌ను హైవే మొబైల్ పోలీసులు అతి కష్టంపై బయటకు తీసి అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పోలీసులు క్రేన్ సహాయంతో రోడ్డుకు అడ్డంగా పడిన లారీని తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోలీసులు ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో చోరీ



చోరీ జరిగిన భీమలింగేశ్వర స్వామి ఆలయం

సబ్బవరం: ఇరువాడలో జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న భీమలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. సుమారు రూ.లక్ష విలువ చేసే కిలో బరువు కలిగిన వెండి ధార పాత్రను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఆలయ ఈవో రాధా సులోచన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆలయ అర్చకులు దంతులూరి లక్ష్మికృష్ణ కల్యాణ శర్మ యథావిధిగా ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో ఆలయ తలుపులు మూసి ఇంటికి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులకు తలుపులు తీసి ఉండడాన్ని గుర్తించి ఆలయ నిర్వాహకులకు సమాచారం అందించారు. ధారపాత్ర కనిపించడం లేదని గుర్తించారు. అర్చకులు చోరీ సమాచారాన్ని ఈవో దృష్టికి తీసుకెళ్లారు. ఘటనపై ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రంగనాథన్ సేవలు చిరస్మరణీయం



రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది, విద్యార్థులు

పెందుర్తి: గ్రంథాలయ శాస్త్ర పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ సేవలు చిరస్మరణీయమని గ్రంథాలయాధికారి బత్తిన సూర్యకళ అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో రంగనాథన్ 132 జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. రంగనాథం సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి బేత రామం, పెందుర్తి జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు జగదీష్, స్థానిక పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ రహితంగా ఆంధ్రా యూనివర్సిటీ



ర్యాగింగ్ రహిత క్యాంపస్ ప్రారంభోత్సవంలో ఏయూ విద్యార్థి వ్యవహారాల డీన్ విజయ్‌మోహన్

విశాఖ సిటీ: ర్యాగింగ్ రహితంగా ఆంధ్రా యూనివర్సిటీని నిలపాలని విద్యార్థులకు ఏయూ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ పిలుపునిచ్చారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ర్యాగింగ్ రహిత క్యాంపస్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ కారణంగా యువత జీవితం నాశనమవుతోందన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడటం, ప్రోత్సహించడం సరికాదని, విద్యార్థుల మధ్య స్నేహభావం, సత్సంబంధాలు ఎంతో అవసరమని సూచించారు. ఏయూను ర్యాగింగ్ రహితంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులకు ఎటువంటి సమస్య ఎదురైనా వెంటనే విద్యార్థి వ్యవహారాల కార్యాలయానికి తెలియజేయాలని కోరారు. నిరంతరం విద్యార్థులకు ఆచార్యులు, సిబ్బంది అవసరమైన సహకారాన్ని అందిస్తారని చెప్పారు. ర్యాగింగ్‌కు దూరంగా ఉంటామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆచార్య విజయ్‌మోహన్ మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు బానిస కాకూడదని సూచించారు. యువతరం విలువైన మానవ, మేధో వనరులుగా నిలవాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆచార్య పాల్ డగ్లస్, ఆచార్య ఎస్.ఎం.యుగంధర్ పాల్గొన్నారు.